అప్యాయత, జాలి, కరుణ. అతడు తనకు బంట్రోతు. "నేను ఏ క్షణాన ఏమదుగుతానో అని తత్తరపడుతూ వుంటాడు. అతని భావి జీవితం అంతా నామీద ఆధారపడిందని అతని గట్టి నమ్మకం. నేను ఏంచెయ్య కలుగుతానో నాకే అర్థం కావటంలేదు. నన్ను ఏమీ అడగడు. నాకు అతని మీద సానుభూతి రోజు రోజుకు పెరిగి పోతోంది. నామీద బాధ్యతలు రోజు రోజుకు గుట్టలు గుట్టలుగా పేర్చుకుంటూ పోతూ వుంటాడు. నా అభిమానాన్ని, నా ఆదరాన్ని పొందాలని తాపత్రయ పడుతూవుంటాడు. కాని నేను ఏంచెయ్యగలను ! నాకేమీ తోచటంలేదు.'' మల్లేశ్ వైపుకు చూస్తూ సూర్యాం తీవ్రంగా బాధపడుతూ వుంటాడు ఎప్పటి కప్పుడు.

సూర్యం కాఫీ త్రాగుతున్నంత సేపు ఒదిగి తలుపుచాటున నక్కిన వాడల్లా కప్పు క్రింద పెట్టగానే, ఇట్టే తీసేసి, తన తువ్వాలతో టేబుల్ను తుడిచి, ఎంతో వినయంగా వంగి "నీళ్ల తోడమంటారా బాబు' అన్నాడు మల్లేశ్. సమాధానం కోనమైనా ఒక్కక్షణం ఆగడు. అక్కడే నిలబడి వుంటే అయ్యగారికి చిరాకు కలుగుతుందేమో అని,చప్పున డ్రాయరు క్రింద బూట్లు తీసి మోకాలుమీద పెట్టుకుని పాలిష్ పట్టిస్తుంటాడు. అన్నీ చూస్తూనే సూర్యం. మెదలకండా వూరుకుంటాడు.

సూర్యం మనస్సు తీవ్రంగా బాధపడుతోంది. ఒకమూల ఇంటికి వెళ్ళిపోవాలనే తాపత్రయము ఎక్కువైపోతోంది. ఇక్కడ ఆఫీసు పనులు త్వరగా తెమలటంలేదు. రోజురోజుకు ఏదో క్రొత్త విషయము సూర్యానికి గోచరిస్తూనే వుంటుంది. విపరీతంగా ఆలోచించే అలవాటుకు లొంగిపోయి వుండటం వలన ప్రతివిషయంలోనూ నాజూకుగానే అలసిపోతాడు. ముందుకు చొరవగా సాగలేక పోతున్నాడు. ఎందుకు ఇంత దౌర్బల్యము! ఎందు కింత సోమరితనము!తనలోతాను తీవ్రంగా చర్చించుకుంటూ వుంటాడు. ఇక్కడ

ఇన్‌స్పెక్షన్‌కని వచ్చినప్పటినుంచి తనలో ఏదో మార్పు వచ్చినట్లు కనిపిస్తోంది. కారణం ఫలనా అని చెప్పటానికి అర్థం కాకుండా వుంది. అంతా సున్నితంగా కనిపిస్తోంది. తన వూహలకు తగ్గట్టుగానే మనుష్యులు కనిపిస్తున్నారు. క్షణం గడవటానికి ఎంతో అలసటపడిపోతూ వున్నాడు. అడుగడుక్కీ ఏమిటో ఆలోచనలు. పిరికితనం వెంటపడి తరుము కొస్తునట్లు కనిపిస్తోంది.

సాయంత్రం రోజూ క్లబ్బుకు పోయేవాడు. ఆనాడు ఆఫీసునుంచి వచ్చీ రావటంతోనే కోటు విప్పి వంకెకు తగిలించి పుస్తకం చేతపట్టు కుని, కుర్చీలో చేరగిలపడ్డాడు సూర్యం. మల్లేశ్, సూర్యం పోకడ చాలా సన్నిహితంగానే కనిపెడుతున్నాడు. రెండు క్షణాలు ఆగి. టాటు తీసుకుని, సూర్యానికి కనిపించేలాగున, టేబిల్ మీద పెట్టాడు. సూర్యం ఓర కంటితో చూసినట్లు కనిపెట్టేశాడు. అయ్యగారు ఇవ్వాళ క్లబ్బుకు వెళ్ళరని ఖాయం చేసుకున్నాడు. ఆయన అట్లాగే బింకంగా పుస్తకము పట్టుకునే కూర్చున్నాడు. అయ్యగారు చాలా చిరాకుగా వున్నట్లు కనిపిస్తున్నారు. ఏమిటా కారణం అని మల్లేశ్ ఆలోచించుకుంటున్నాడు. తనవలన ఏమీ లోపం జరగలేదని సంతృప్తిపడ్డాడు. ఇక ఆఫీసు వ్యవహారాల్లోకి పోయి చూశాడు. ఇవ్వాళ జరిగిన పెద్ద విశేషము ఏమీలేదు. అయితే అన్నమ్మ గారు ముఖ్యమైన కాగితం ఒకటి టైపు చెయ్యలేదని అయ్యగారితో పెద్ద గుమాస్తాగారు ఫిర్యాదు చేశారు. దానివలన ఏమన్నా కోపం వచ్చిందా అనుకుంటున్నాడు. అయినా ఎట్లాగు ఈ విషయాన్ని అడగటమా అను కుంటూ కాఫీ తీసుకు వెళ్ళి యిచ్చాడు. సూర్యం మల్లెశ్ మొహంలోకి చూస్తూ "ఎన్నాళ్ళబట్టి పనిచేస్తున్నావు ఇక్కడ?" అన్నాడు.

నాకళ్ళ ఎదుట గుమాస్తాగా చేరిన విశ్వనాథంబాబు ఆఫీసరయి పట్నం వెళ్ళిపోయాడు అయ్యగారూ. ఆయనకు ముందుగా మూడు సంవత్సరాల నుంచి పనిచేస్తున్నాను బాబుగారూ...అన్నాడు ఎంతో శాంతంగాను, సగర్వంగాను.

అబ్బ! ఎంత బాధపెట్టావు! అనుకున్నాడు సూర్యం, ఇంకా ఏమీ ప్రశ్నించలేకపోయాడు. కళ్ళు గిర్రున తిరిగాయి. నేను పనిచెయ్యలేను అనుకున్నాడు.

సూర్యం మొహంలోకి చూసి, మల్లేశ్ వెనక్కు తగ్గాడు. రెండు క్షణాలు ఆగి, "అయ్యగారు" అన్నాడు. సూర్యం మళ్ళీ తలెత్తిచూశాడు.

'పెద్ద గుమాస్తాగారు ఆ కాగితాన్ని టైపు చేయించి పంపేశారు... అన్నమ్మ చాలా మంచి అమ్మగారండీ,..హటాత్తుగా ఆగిపోయాడు మల్లేశ్.

సూర్యం పెద్ద నిట్టూర్పు విడిచాడు. అతని మనస్సంతా కలవరపడిపోయింది. ఆఫీసు కళ్ళ ఎదుట కట్టినట్లుంది. అందరూ కనిపిస్తున్నారు.

పెద్ద గుమాస్తా, చిన్న గుమాస్తాలు, టైపిస్టు మిస్ అనూరాధ, ఏమిటో జీవితాలు అనుకున్నాడు. తాను ఆఫీసులో ఆ అమ్మాయిని అన్నది మాత్రం ఏముంది! ''టైపు ఎందుకు చెయ్యలేదు. వెంటనే పంపించేసెయ్యి అన్నాను అంతేగా !''

''అబ్బ! ఒక్కకాగితం టైపు చెయ్యనంత మాత్రాన ఆ అమ్మాయి అంత ప్రాధేయపడాలిసి నంత అవసరము ఏమీలేదు. ఎంతో జాలిగా అడిగింది. క్షమించమని కూడా కోరుకుంది. క్షమించమని కోరుకునేటంత

తప్పుపని ఆమె ఏంచేసిందని.? ఏమిటో  ఈ పద్ధతులు నాకసలు అర్థం కావటంలేదు. ఇప్పుడే టైపుచేసి తీసుకువస్తాను అని అనగలిగిన హుందాతనం ఆమెలో వుంటే నాకు ఎంతో సంతోషంగావుండేది. ఆమె అంతగా ఎందుకు లొంగిపోయినట్లు మాట్లాడిందో అర్థం కావటంలేదు. నా అభిమానం పొందటానికి ఇలాంటి పద్ధతులవలన ప్రయోజనంలేదు. అయినా నా అభిమానం వలన ఆమెపొందే లాభం!  మనిషిని గౌరవించి సమాన స్థాయిలో చూస్తున్నవాళ్ళమీద నాకున్న ఆదరాభిమానాలువేరు. నామంచితనాన్ని వాళ్లు అతివినయంతో కొనుక్కోవాలంటే మాత్రం సాధ్యంకాదు. అయినా మిస్ అనూరాధ అలాంటి మనిషికాదు. కనుసంజ్ఞలమీద ఇట్టేఅల్లుకు పోగలిగిన వ్యక్తిత కలది. అబ్బ, ఏమిటీ ఆలోచనలు. చిన్న చిన్న విషయాలు పెద్దగా ఆలోచించటం మానేస్తేనే,నామనస్సుకుశాంతి.'' అనాడు ఎక్కడకు వెళ్ళలేదు. ఇలాంటి ఆలోచనలతోనే సరిపోయింది. ఆరాత్రి నిద్రపోనూలేదు. రాత్రంతా నిద్రాదేవత స్థానంలో అఖిలవచ్చి కూర్చుంది. ఆమెతో ఏవేవో మాట్లాడుకుంటూనే వున్నాడు. తెల్లారేటప్పటికి అఖిలను సాగనంపేస్తాడు. పగలల్లా మిస్ అనూరాధ కళ్ళల్లో మెసులుతూ ఉంటుంది.

ఏ కాగితం టైపు చేసినా, ఏచిన్నవిషయం అడగాలసివచ్చినా మిస్ అనురాధ సరాసరి సూర్యం గదిలోకి వెళ్ళిపోతుంది. అక్కడ గుమాస్తాలు నివ్వెరపోయి చూస్తూవుంటారు. చీటికిమాటికి అక్కడకు వెళ్ళటమంటే ఆమెకు పూర్తిగా అలవాటు అయిపోయింది. ఒక్కొక్కసారి లోపల్నించి వస్తూనే గుమాస్తాలవైపుకు చూసి నవ్వుతుంది. ఇంకా వాళ్ళకు చిరాకు ఎక్కువయిపోతుంది. పెద్దగుమాస్తాకు విపరీతమైన గుర్రుగావుంది.తనను లక్ష్యపెట్టటం లేదని బాధవుంది. పోనీ సూర్యమైనా-ఈచిన్న విషయానికి

ఇక్కడికి రావటం ఎందుకు, ఆ పెద్దగుమాస్తాని అడగమని అనటంలేదు. తనకు తెలీకుండానే, అన్నిసార్లు కూడా ఆమెకు సమాధానం చెప్పి పంపి స్తున్నాడు.

ఆమె అంటే, సూర్యానికి విపరీతమైన జాలి, కరుణ ఏర్పడిపోయి నాయి. ఈమె అసలు టైపిస్టుగా వుండాలసినదికాదు. ఆమె అందానికి, ఆమె యౌవనానికి, ఆమె తెలివితేటలకు, తగిన సమాధానం దొరికివుండాలిసింది. బ్రతుక్కీ చావుకు మధ్య అల్లలాడుతూవున్న ఈ గుమాస్తాల మధ్య ఆమె కూర్చుని, ఒకయంత్రాన్ని ఆసరాగా పెట్టుకుని తన జీవితాన్ని వెనక్కు నెట్టేసుకుంటోంది తనకోసం ఏమిచేసికోవాలో తెలియని అమాయకురాలు. అప్పుడప్పుడు ఇలాంటి ఆలోచనవచ్చి తన మెదడును తొలిచివేస్తూ వుంటాయి.

ఆమెనుగురించి నేనెందుకు ఆలోచించటం అనుకుంటూ పస్తాయిస్తూ వుంటాడు. ఎంత వద్దనుకున్నా, ఆమెను గురించిన ఆలోచనలు అతనివెంట పడుతూనే వుంటున్నాయి. తాను పిలుస్తే వచ్చిన మిస్ అనూరాధను చూసి తృప్తిపడతాడు, డిక్టేషను చెప్పినదంతా నీటుగా టైపుచేసి ముందర పెడుతుంది. నేను మెచ్చుకోవాలని ఆమె ఉద్దేశం. పాపం పూర్తి అమాయకురాలు. మిస్ అనూరాధకు అనుభవంలేదు. అనుకుంటూ వుంటాడు. తన ఆలోచనల్లోంచి ఆమెను తొలగించి, అఖిలను పావనిని తీసుకురావాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

గదిలో తలవంచుకుని వ్రాసుకుంటున్న సూర్యానికి మిస్ అనూరాధ వచ్చినట్లే తెలియదు. ఇట్టే తలఎత్తాడో లేదో కళ్ళ ఎదుట ఆమె ప్రత్యక్షమయింది. సూర్యం ఒళ్లు జల్లుమంది. కళ్ళార్పకుండా ఆదేపనిగా చూశాడు. క్షణంలో మళ్ళీ భయమేసింది.

ఏం కావాలని అడుగుదామనుకున్నాడు కాని. ధైర్యం చాలలేదు.

నమస్తే అన్నది.

కూర్చోమని కుర్చీ చూపించాడు. నమస్కారాన్ని స్వీకరిస్తూ. గుటకలు వేస్తోంది. మాట పెగిలి పైకి రావటంలేదు. పమిటను రెండు మూడుసార్లు గట్టిగాలాగి ఒంటిని చుట్టేసుకుంది. అతని మొహంలోకి చూడటానికి వెనకాడుతోంది.

'ఏమీలేదండీ...నేను ఆఫీసులో...'మధ్యలో ఆపేసింది.'...గౌరవంగా పనిచెయ్యటానికి...అంటే నాపని నేను చేసుకుపోవటానికి...నా ఉద్దేశం నాపని నేను చేసుకుపోతుంటే కూడా_ఇంకా ముందుకు సాగలేకపోయింది.

'...మీముందు ఏమాట ఎట్లు విప్పిచెప్పాలో అర్థంకావటంలేదు... అసలు నేను '...మగవాళ్ళతో...ఇంత ఎదురుగానైనా సరి కూర్చుని మాట్లాడలేదు...అసలు నాకు అలవాటులేదు,...నాకుఏం చెప్పాలో కూడా తెలీదు. నామనస్సులో మాట మీకు అర్థమవుతే......అబ్బ'' అని. చప్పున నాలిక కరచుకుంది. దడ బయలుదేరింది. శరీరం అంతా వణికిపోతుంది. పెదిమలు తడబడుతున్నాయి. తను అట్లా అనకుండా వుండాలిసిందని తపన పడిపోతోంది. జేబురుమాలుతో మొహాన్ని తుడుచుకుంటోంది. చీటికిమాటికి బిత్తరు చూపులతో అటుఇటూ చూస్తోంది. తల వంచేసుకుంది. కళ్ళు అరుస్తోంది. సూర్యం మెదలకుండా అట్లాగే కూర్చున్నాడు.

వెళ్ళొస్తాను అంటూ అనూరాధ లేవబోయింది.

సూర్యం కూడా అప్రయత్నంగా లేవబోయాడు.

ఆఫీసులో..."అంటూ ఆపేశాడు".

'అవును...ఆఫీసులో...'అంటూ ఆపేసింది. గబగబ ముందుకు సాగిపోయింది.

ఒకటి రెండు రోజులదాకా మిస్ అనూరాధ, సూర్యాన్ని చూస్తే ఉలికిపడుతోంది. ఆమెను చూసినప్పుడల్లా అతను తృళ్ళిపడుతున్నాడు. ఇనస్పెక్షన్ త్వరగా ముగించేసి వెళ్ళిపోవాలనే నిశ్చయంలో వుండి పోయాడు సూర్యం. పనులు చకచక సాగిపోతున్నాయి. ఆమెకు మాత్రం ఎంతో బాధగా వుంది. పైకి చెప్పలేని ఆరాటం పడిపోతోంది. సూర్యం మాత్రం తీవ్రమైన మథనంలో పడిపోయాడు. సూర్యంతో ఏదో చెప్పదామని, అతనిదగ్గరకు వెళ్ళాలని తీవ్ర ప్రయత్నం చేస్తుంది. కాని దగ్గరకు వెళ్ళటానికి భయపడిపోతోంది. సూర్యం మిస్అనూరాధను పిలిపించి ఏదో మాట్లాడుదామనుకుంటాడు. తీరా ఆలోచిస్తుంటే తీవ్రమైన భయమేస్తుంది. మళ్ళీ ఆ ప్రయత్నాన్ని విరమించేస్తాడు. ఒకరికి తెలీకుండా ఒకరు. మనస్సులో కలవరం బయలుదేరుతున్నది. ఆమె అంత సన్నిహితంగా తన హృదయంలోకి వచ్చి కూర్చుంటుంది. అతను అంత ఆప్యాయంగా ఆమె మనస్సు నింపేస్తున్నాడు. తాను అందంగా సూర్యం ఎదుట కనుపించాలని ఆమె ఉబలాటపడుతూంది. అతను చనువుగా ఆమెతో మాట్లాడాలని తాపత్రయపడుతూ వుంటాడు. ఆఫీసులో పనిపూర్తిగా మానేశాడు. అతని మనస్సంతా అదోవిధంగావుంది. ఇంట్లోకి వచ్చి కూర్చుంటాడు. కాసేపు కళ్ళు మూసుకుని అలసట తీర్చుకుందామనుకున్నా ఆమె ఎదురుగా కనిపించి తీరాల్సిందే. ఏ పుస్తకంతెరచినా, మిస్అనూరాధ కనుపించాల్సిందే. ఏరకంగా ఆలోచించినా ఆమె వచ్చితీరాల్సిందే. ఎట్లాగైనా ఆమెను తన దృష్టిలోనుంచి తప్పించాలనే విశ్వప్రయత్నం చేస్తున్నాడు. తన వశం కాకుండా వుంది. తాను ఆమెకు తెలీకుండానే ఆమెకు లొంగిపోయాడా

అనిపిస్తూంది. తన మనస్సు స్థిమితం తప్పిపోతూంది. పట్టు సడలిపో తూంది. గుప్పెట్లో తన విభ్రాన్ని గట్టిగా బిగించేసి, బరువుగానే నిలబడ్డాడు.

ఎదురుగా మిస్ అనూరాధ నిలబడి వుంది. ఆమె చీర అంచులు చిరుగాలికి రెపరెప కొట్టుకుంటున్నాయి. తడి, పొడి కనురెప్పలు అల్ల ల్లాడి పోతున్నాయి. కళ్ళల్లో కాటుక కొంచెం కొంచెంగా ముఖం అంతా పాకిపోయినట్లుంది. ఆమె నిట్టనిలువుగా నిలబడివున్నదన్న మాటేగాని. తనకు ఏమీ కనుపించనట్లయిపోయింది. తాను అక్కడకు ఎందుకువచ్చి అట్లా గాభరా పడిపోయిందో అర్థం కావడంలేదు. ఒక్కమాటకూడా మాట్లాడలేకపోతూంది. శరీరం కంపిస్తోంది.

అయ్యగారూ! ఉత్తరం వచ్చిందంటూ, మల్లేశ్ వచ్చాడు. ఇద్దర్నీ చూసి, బిత్తరు పోయాడు. క్షణంలో మెల్లమెల్లగా వెనక్కు వెళ్ళి వెళ్ళిపోయాడు.

సూర్యం ఉత్తరాన్ని చదువుతున్నాడు. కళ్ళు పెద్దవి చేసుకున్నాడు. క్షణంలో తన ఆలోచనలన్నీ పటాపంచలయిపోయాయి. అదరా బాదరాగా అటూ యిటూ చూచాడు. మల్లేశ్ అని పిలిచాడు. వులిక్కిపడుతూ వచ్చి నిలబడ్డాడు మల్లేశ్.

"ఇవ్వాళ సాయంత్రమే యింటికి వెళ్ళిపోవాలి, సామాను సర్దె శెయి" అన్నాడు.

మిస్ అనురాధ రెండుకళ్ళు రెండుచేతులతో గట్టిగా మూసుకుని వెనక్కు తిరిగింది.

సూర్యం హృదయం బద్దలయి రెండు భాగాలయినట్లనిపించింది. పిచ్చివానిలాగా ఆఫీసంతా అటు, యిటూ పచార్లు చేశాడు. ప్రతిధ్వని

దగ్గర సెలవుతీసుకుంటున్నాడు. తనకళ్ళు అటూ, యిటూ వెదుకుతున్నాయి. మిస్ అనురాధ ఆఫీసుకు రాలేదు. ఆమె ఎక్కడ అని అడిగే సాహసం లేకపోయింది. అన్నమ్మగారు యివ్వాళ ఆఫీసుకు రాలేదండీ! అన్నాడు మల్లేశ్.

సూర్యం వళ్లు పులకించింది. మల్లేశ్ దగ్గర శలవ్ తీసుకుంటూ' కళ్ళనీళ్లు పెట్టుకున్నాడు.

'నీకు నే నేం చెయ్యలేకపోయాను' అంటూ అస్పష్టంగా గొణిగాడు.

అయ్యగారు క్షేమంగా వుంటే అదే చాలు నన్నాడు మల్లేశ్ కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

తనకు తీవ్రంగా అసంతృప్తి బయలుదేరింది. చివరిసారిగా ఒక్కసారి మిస్ అనూరాధతో మాట్లాడుదామనుకున్నాడు. ఆమెదగ్గర శలవు తీసుకొనటంవలన తనకు కొంత మానసిక శాంతి లభిస్తుంది. ఆ శాంతి నాకు లేకుండా ఆమె చేసి వెళ్ళిపోయిందని బాధపడుతున్నాడు. ఆమె అక్కడ లేని లోపం సూర్యం హృదయాన్ని దహించేస్తోంది. ఇక అతను వెళ్ళిపోతున్నాడు. మళ్ళి యీ ప్రాంతాలకు రావాలసిన పనిలేదు. మళ్ళి మిస్ అనూరాధను చూసే అవకాశం వుండదు. ''ఆమె నాపట్ల చూపించిన ఔదార్యానికి కనీసం కృతజ్ఞత నైనా చెప్పుకోవాలి. యీ అవకాశం కూడా నాకు లేకుండా చేసింది'' అని తీవ్రంగా వ్యధపడుతున్నాడు. మల్లేశ్‌తో తన మాటగా ఆమెతో చెప్పమని చెప్పుదామమకున్నాడు. మనస్సు ఒప్పటం లేదు.

రైలు స్టేషనుకు వచ్చేశాడు. రైలు వచ్చేస్తోంది ఓమూల. గుండె దడదడమంటోంది. మల్లేశ్‌కు కాళ్లు చేతులు ఆడటంలేదు. సాగనంపటానికి వచ్చిన నలుగురూ సూర్యాన్ని స్తోత్రం చేస్తున్నారు. ఏవో సమాధానాలు

చెప్పేస్తున్నాడు. రైలులో ఎక్కి కూర్చున్నాడు. ఇంకా రైలు సాగే సైము కూడా అయిపోతోంది. ప్లాటుఫారం అంతా సూర్యం కళ్లు గాలిస్తున్నాయి. ఏదో పోయిన వస్తువును వెదకినట్లు తహతహలాడి పోతున్నాడు. గంట కూడా కొట్టేశారు. సూర్యం ఆవేదన. ఆవేశం ఎక్కువై పోతున్నాయి. మల్లేశ్ భుజంమీద చరిచాడు. అతను బండి దిగాడు.

ఎక్కడినుంచి వచ్చిందో మరి అమాంతం ఉప్పెనలాగ వచ్చి పడింది మిస్ అనూరాధ. విపరీతంగా రొప్పుతోంది. కళ్ళవెంట ఒకటే ధారగా నీళ్లు కారుతున్నాయి. సూర్యం కూర్చున్న పెట్టె దగ్గరకు గబగబ వచ్చేసింది. తడబడుతూ చేతిలో వున్న గులాబి పువ్వును సూర్యానికి అందిచ్చింది. గులాబి పువ్వు సూర్యం చేతిలో గజగజ వణికిపోయింది. ఆమె రెండు మాటలు తడబడుతు అన్నది. ఇంజను కూతలో అస్పష్టమై పోయినయి. గార్డు పచ్చజెండా చూపిస్తున్నాడు. రైలు సాగింది. మిస్ అనూరాధ రెండడుగులు ముందుకు వేసింది. సూర్యం కిటకీలోంచి తల దూర్చి ఏవో అన్నాడు. ఇంజన్ పెద్ద ధ్వని చేసుకుంటూ సాగిపోతోంది. ఆమె జేబురుమాలను వూగిస్తోంది. సూర్యం గులాబి పువ్వును చేత్తో పట్టుకొని పెదిమలు కదిలిస్తున్నాడు. కళ్ళు ఎర్రబడిపోయినయి. ప్లాటుఫారం మీద దూరంగా మిస్ అనూరాధ చేతులు రెండు మొహాన అడ్డం పెట్టుకొని వెక్కివెక్కి ఏడుస్తోంది.

సూర్యం హృదయం బ్రద్దలై పోయినట్లు అనిపించింది. అతని మనస్సు తపనపడిపోతోంది. ఆ క్షణంలో ఏం చెయ్యాలో తోచటంలేదు. తనకు అతిసన్నిహితమైన వ్యక్తి నుంచి ఎంతో దూరంగా రైలు నిర్దాక్షిణ్యంగా తనను లాక్కుపోతోంది. తన హృదయానికి అతి సన్నిహితంగా వచ్చిన మిస్ అనూరాధను విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాడు. అయితే తన హృదయంలో దాక్కున్న అఖిలపాపవిల దగ్గరకు వెళ్లుతున్నాడు. అదే సూర్యానికి మిగిలిన తృప్తి.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)